సాగునీటి హక్కులపై ఉద్యమిద్దాం.. రండి

- ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుదాం
- కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు ఆరోపణలకు దీటుగా జవాబిద్దాం
- నల్లగొండ బహిరంగ సభకు భారీగా తరలుదాం
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 12: నల్లగొండలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్దామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ పిలుపునిచ్చారు. మైలార్‌దేవపల్లిలోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, కృష్ణా బేసిన్ (కేఆర్ఎంబీ) ప్రాజెక్టులను, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు పరిధిలోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నల్గొండలో భారీ బహిరంగ చేపడుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక వైఖరిని ఖండిస్తున్నామన్నారు. కేంద్రం నుంచి తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఉద్యమిస్తున్నదన్నారు. ఈ బహిరంగ సభకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు. కృష్ణా జలాల పంపకాలపై కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై పలు అబద్ధపు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో, ఆ ఆరోపణలపై బహిరంగ సభలో దీటైన జవాబులు కేసీఆర్ ఇస్తారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఛలో నల్గొండ భారీ బహిరంగ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నార్సింగి మున్సిపల్ అదనపు కమిషనర్‌గా శరత్‌చంద్ర

మణికొండ, ఫిబ్రవరి 12: నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్‌గా బి.శరత్ చంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. దీంతో సోమవారం ఉదయం నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రేమికులకు రక్షణ కల్పించండి'

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 12: ప్రేమికులపై దాడులు జరిగే ప్రమాదమున్నందున ప్రేమికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జేరూసలేం మత్తయ్య సోమవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రేమికులు వాలంటైన్స్ డేను జరుపుకోవద్దని బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థల కార్యకర్తలు హెచ్చరించడం సరికాదని, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు భంగం వాటిల్లుతున్నదన్నారు. ఈ నెల14న జరిగే ప్రేమికుల దినోత్సవాన్ని అడ్డుకునే వారిపై చర్యలు తీసుకుని, ప్రజాస్వామ్యంలో పౌర హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కోరారు.

రహ్మత్‌నగర్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన

సమస్యలను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 12: యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ పరిధిలోని రహ్మత్‌నగర్ డివిజన్‌లో సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పర్యటించి పలు సమస్యలను పరిశీలించారు. డివిజన్‌లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులతో పాటు రోడ్డు వెడల్పు కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఇటీవల కమిషనర్‌ను కలిసి అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు చేసిన నేపథ్యంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌తో కలిసి ఆయన విసత్తృంగా పర్యటించారు.

కార్యక్రమంలో యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఈఈ రాజ్ కుమార్, ఇతర అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు

ఫిర్యాదులు తీసుకుంటున్న రాజేంద్రనగర్ ఉప కమిషనర్ రవికుమార్

బండ్లగూడ, ఫిబ్రవరి 12: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ముందంజలో ఉండి పనిచేస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఆయన పలువురి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జలాల హక్కుల పరిరక్షణకు తరలిరండి

యూసుఫ్‌గూడలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 12: కృష్ణానవొ జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణకై జరిగే భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, యూసుఫ్‌గూడ డివిజన్ కార్పొరేటర్ బండారి రాజ్ కుమార్ పటేల్ కోరారు. యూసుఫ్‌గూడలోని కార్పొరేటర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం నుంచి బస్సులు ప్రారంభమవుతాయని, కార్యకర్తలు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

'సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి'

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 12 : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 16న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్మికవర్గం ఎన్నో పోరా టాలు, త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తూ ప్రజల బతుకులను చిన్నాభిన్నం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు సంఘటిత పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పదోన్నతులు, బదిలీల తర్వాతే నియామకాలు చేపట్టాలి

- ప్రభుత్వానికి గురుకుల జేఏసీ కన్వీనర్ నారాయణ డిమాండ్
- నేడు ప్రజాభవన్‌లో వినతిపత్రాలు సమర్పణ

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ, చిత్రంలో తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 12: రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల తర్వాతే నూతన నియామకాలు చేపట్టాలని గురుకులాల జేఏసీ కన్వీనర్ మామిడి నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులాల్లో ఎంతో కాలంగా పనిచేస్తూ సీనియార్టి ఉన్నా పదోన్నతులు పొందలేకపోయారన్నారు. ఇప్పటికే 317 జీవో సమస్య ఉండగా, ఈ ఏడాది నూతన నియామకాల కోసం ఉత్తర్వులు జారీ చేయడం వల్ల పది వేల మంది గురుకుల ఉపాధ్యాయులు నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే నియామకాలు చేపట్టాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు మంగళవారం ప్రజాభవన్‌లో వెయ్యి మంది ఉపాధ్యాయులతో కలిసి వెళ్లి వినతిపత్రాలు సమర్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కృష్ణారెడ్డి, ప్రభుదాస్, రుషికేష్ కుమార్, మధుసూదన్, వేదాంతాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో డెవ్ ఆప్.. అప్లికేషన్స్‌పై శిక్షణ

శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న బోధనా సిబ్బంది

మణికొండ, ఫిబ్రవరి 12: మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాకల్టీలు తమలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకొని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని మహాత్మగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కళాశాల సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన్ డెవ్ ఆఫ్, అప్లికేషన్స్‌పై శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డెవ్ ఆఫ్, అప్లికేషన్స్ మీద ఫ్యాకల్టీలకు శిక్షణ ఇవ్వడం వల్ల ప్యూచర్‌లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ సీఆర్‌కె రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : కార్పొరేటర్

నజీర్‌బాగ్ బస్తీలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 12: ప్రజలకు మౌలిక వసతుల కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచనల మేరకు సోమవారం నజీర్‌బాగ్ బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నామని, ప్రత్యేకంగా బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని బస్తీవాసులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. బాత్‌రూమ్‌ల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.రామన్ గౌడ్, మహేశ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

విద్యార్థులను సత్కరిస్తున్న డాక్టర్ అవినాశ్, విజయ్ కుమార్, హిమ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 12: సీఏ, సీఎంఏ కోర్సులో అవినాశ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో అవినాశ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు అభినందన వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలను అవినాశ్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ అవినాశ్ బ్రహ్మదేవర ప్రారంభించారు. ఈ సందర్భంగా 400 మంది చార్టెడ్ అకౌంటెంట్, సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఏ, సీఎంఏ) విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన సీనియర్ సీఎంఏలు విజయ్‌కుమార్ అగస్త్య, హిమ విద్యా సంగరపులు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కేపీ రామ్, బి.సంతోష్, డీన్ సుశీల కందూరి, డొమెస్టిక్ ప్రొఫెషనల్ కోర్సెస్ విభాగాధిపతి, సీఏ గౌతమ్‌జైన్, పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించని వారిపై చర్యలు: డీసీ

ఆస్తి పన్ను చెక్కులు స్వీకరిస్తున్న ఏఎంసీలు కమల్, బాలరాజ్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 12: ఆస్తి పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సేవా ఎస్లావత్ ఆదేశించారు. ప్రాపర్టీ ట్యాక్స్ సకాలంలో చెల్లించి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. సోమవారం ఆస్తి పన్ను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఏఎంసీ కమల్, ఇన్‌చార్జ్ ఏఎంసీ బాల్‌రాజ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఆస్తి పన్ను వసూలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఆస్తిపన్ను చెల్లించకుండా మొండికేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడిపై దాడి

- మజ్లిస్ నాయకులపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ పార్టీ నాయకుడిపై దాడికి పాల్పడిన మజ్లిస్ నాయకులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం క్రిమినల్ కేసు నమోదయ్యింది. వివరాల్లోకి వెళ్తే.., బంజారాహిల్స్ రోడ్ నం.12లోని సయ్యద్ నగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ అబ్దుల్ జమీల్ అనే వ్యక్తి కారు డ్రైవర్‌గా పనిచేయడంతో పాటు అహ్మద్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తుంటాడు. గృహజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. విద్యుత్ శాఖ సిబ్బందితో కలిసి జమీల్ తిరుగుతున్న సమయంలో అక్కడకు చేరుకున్న స్థానిక మజ్లిస్ నాయకులు ఎండీ. ఉస్మాన్, ఎండీ అక్బర్ వాగ్వాదానికి దిగారు. స్థానిక కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకపోవడంతో పాటు పార్టీల కార్యకర్తలను వెంటేసుకుని ఎలా తిరుగుతారు? విద్యుత్ శాఖ అధికారులను నిలదీయడంతో పాటు వారిని అడ్డుకుని దుర్భాషలాడారు. ఈవ్యవహారాన్ని అక్కడే ఉన్న జమీల్ వీడియో తీసేందుకు ప్రయత్నించాడు. దీంతో వారిద్దరూ కలిసి ఫోన్ లాక్కుని పారవేయడంతో పాటు జమీల్ మీద దాడికి పాల్పడ్డారు. అంతు చూస్తామంటూ హెచ్చరించారు. ఈ మేరకు బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఐపీసీ 323, 341, 353, 427, 506 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మూర్ఛ వ్యాధిపై అవగాహన సదస్సు

బేగంపేట్, ఫిబ్రవరి 12 : మూర్ఛ అనేది మెదడుకు వచ్చే సర్వసాధారణమైన వ్యాధి అని కిమ్స్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రహి అన్నారు. దేశంలో కోటిమందికి పైగా ఈ వ్యాధి బాధితులున్నారని ఆయన తెలిపారు. 'అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినం' సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ కిమ్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, న్యూరాలజిస్ట్ సర్జన్ సీతాజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. మూర్ఛవ్యాధిపై ఉన్న అపోహలపై పలువురు వైద్యులు మాట్లాడారు. మూర్ఛ ఉన్న వారిని చిన్నచూపు చూడటం తగదన్నారు.

పోషకాహార వినియోగమే ప్రధానం

- వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ

సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ, తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 12: ప్రస్తుత పరిస్థితులలో పోషకాహార వినియోగం ఎంతో అవరమని, భవిష్యత్ తరాలకు ప్రణాళిక ఉండేలా మనందరి కృషి ఉండాలని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. వెంకటరమణ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వర్సిటీ పరిధిలోని సమావేశపు మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ విద్యను ఎంపిక చేసుకుని బాధ్యతగా శిక్షణ పూర్తి చేసిన వారిని అభినందించారు. భవిష్యత్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి మార్గాలే ఎక్కువన్నారు. కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్, వ్యాల్యూ చైన్‌పై మల్టీ డిసిప్లినరి విధానం ఉండాలని, భవిషత్‌లో సహకారానికి అవకాశాలను అన్వేశించడానికి ఇంటర్ ఇనిస్టిట్యూట్‌ల అనుసంధానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ప్రభుత్వ రంగాలు గృహ ఆధారిత విలువ గొలుసులను అభివృద్ధి చేయడంలో దృష్టి కేంద్రీకరించాలన్నారు. కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ వి. విజయలక్ష్మి పోషకాహార లోపం ఆహార ఉత్పత్తి, ప్రాసెసింగ్ యెక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సూక్ష్మ లోపాలను తగ్గించడం, పోషకాహార లోపాలను ఎదుర్కోవడానికి పోషకాహారం అధికంగా ఉండే ఆహార వినియోగంపై కోర్స్ డైరెక్టర్ డా.టి. కమలజ శిక్షణ నివేదికను సూచించారు. పీజేటీఎస్ ఏయూ విశ్వవిద్యాలయం అధికారులు కమ్యూనిటీ సైన్స్ విభాగానికి చెందిన అధిపతులు, వివిధ ఐసీఏఆర్,ఎస్ఏయూలకు చెందిన 15 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. కోర్స్ సమన్వయకర్తలు డాక్టర్ శ్వేత, ఆర్ఎంసీఎస్ విభాగం, సీసీఎస్సీ, కార్యక్రమానికి ఏఐసీఆర్‌పీ – డబ్ల్యూఏ శాస్త్రవేత్తలు తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ఉడుంగడ్డ ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను పరిశీలిస్తున్న నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు కుమారస్వామి, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 12: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి కోరారు. మైలార్‌దేవపల్లి డివిజన్ ఉడుంగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, నవ యువ యాత్ క్లబ్ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. అనంతరం, కుమారస్వామి మాట్లాడుతూ పాఠశాలకు ఎత్తైన ప్రహరీ లేక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు గోడలు దూకి లోనికి ప్రవేశిస్తున్నారన్నారు. దర్వాజలు, ఇతర వస్తువులను ధ్వంసం చేసి విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో స్లాబ్ పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు పడిపోతుందో తెలియని స్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరువ చూపాలని కోరారు.

దాతలు ముందుకు వచ్చి పాఠశాలల అభివృద్ధికి చేయూత అందించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రమేశ్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేలో నలంద విద్యార్థులకు అవార్డులు

అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందించిన నలంద విద్యాలయాల చైర్మన్ మంతెన శ్రీనివాస రాజు, చిత్రంలో తదితరులు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 12: కరాటేలో నలంద విద్యాలయానికి అవార్డుల పంట పండింది. యద్ధ కళ కరాటేలో నలంద విద్యార్థులకు అవార్డుల పంట పండింది. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 3వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ 2024 ఛాంపియన్ షిప్‌లో నలంద విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను గెలుపుపొందారు. అత్యుత్తమమైన నైపుణ్యాన్ని ప్రదర్శించి గౌతమ్, కీర్తన, ఖలీల్, కీర్తన్, ప్రేమ్ వర్ధన్‌లు అందర్నీ ఆకట్టుకున్నారు. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్‌ల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. నలంద విద్యార్థులు విజ యం సాధించడంతో సోమవారం నలంద విద్యాలయాల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు వారిని అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సూర్య, ప్రిన్సిపాల్ శ్రీలత, సీనియల్ కరాటే కోచ్ జీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్రి గోల్డ్ ఆస్తులను వేలం వేయండి

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.బాలమల్లేశ్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 12: రాష్ట్రంలోని అగ్రి గోల్డ్ ఆస్తులను వేలం వేసి బాధితులకు డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని అగ్రి గోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. బాలమల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో సంఘం ముఖ్య నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అగ్రి గోల్డ్ కంపెనీకి సంబంధించిన ఆస్తులు వెయ్యి కోట్లకు పైగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వేలం వేసి డిపాజిట్‌దారులకు డబ్బులు ఇవ్వాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు గోగుల వెంకటేశ్వర్లు, రజిత, రాజకుమారి, రాజు, పావనరావు, గోపి, కృష్ణారావు, సుధాకర్, నాగేశ్వరరావు, పూర్ణ, పాష, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాత ఆలయ వార్షికోత్సవం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12: ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీ శ్రీ కనకదుర్గాదేవి ఆలయం 17వ వార్షిక వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, చండీ ఆరాధన, విశేష అభిషేకం, నవగ్రహ దుర్గా సహిత శ్రీ మహాచండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం, భారీ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్సార్ నగర్‌లో అగ్నిప్రమాదం

వెంగళరావునగర్, ఫిబ్రవరి 12: ఎస్సార్ నగర్ మొఘల్ రెస్టారెంట్‌లో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. రెస్టారెంట్‌లోని వంటగది నుంచి అకస్మాత్తుగా మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా, అక్కడున్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు.